# సాక్షి
## డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

సోమవారం । 16 । జూన్ । 2025






### నిత్యాన్నదానానికి విరాళం

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి విన్నకోట వికాస్, శ్రీదేవి దంపతులు (విజయవాడ) ఆదివారం రూ.100,116 విరాళం సమర్పించారు.




### అన్నంత సేవ

8లో

మది నిండా భక్తితో.. ఎక్కడెక్కడి నుంచో.. గౌరీపట్నంలోని నిర్మలగిరికి వస్తున్న భక్తుల ఆకలి తీర్చే నిత్యాన్నదాన కార్యక్రమం నిర్విరామంగా సాగుతోంది.

### డెల్టాలకు 6,500 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి ఆదివారం తూర్పు డెల్టాకు 2,800, మధ్య డెల్టాకు 700, పశ్చిమ డెల్టాకు 3 వేలు కలిపి 6,500 క్యూసెక్కుల గోదావరి జలాలు విడుదల చేశారు. సముద్రంలోకి 14,826 క్యూసెక్కుల మిగులు జలాలను విడిచిపెట్టారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 10.15 అడుగులుగా నమోదైంది.

## న్యూస్‌రీల్

### వాడపల్లి వెంకన్నను దర్శించిన కలెక్టర్ దంపతులు



కలెక్టర్ దంపతులకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న డీసీ చక్రధరరావు

కొత్తపేట: వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారిని జిల్లా కలెక్టర్ రావిరాల మహేష్‌కుమార్ దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం దేవదాయ, ధర్మాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, దేవస్థానం ఈఓ నల్లం సూర్యచక్రధరరావు ఆధ్వర్యాన అర్చకులు, వేద పండితులు కలెక్టర్ దంపతులకు స్వాగతం పలికి, ఆలయంలోనికి తోడ్కొని వెళ్లి స్వామివారి దర్శనం చేయించారు. పండితులు వేదాశీర్వచనం అందించారు. శేషవస్త్రంతో ఈఓ సత్కరించి, స్వామివారి చిత్రపటం అందజేశారు. అనంతరం, వాడపల్లి క్షేత్రంలో వివిధ నిర్మాణ పనులను కలెక్టర్ మహేష్ కుమార్‌కు వివరించారు. వాటి పురోగతిని వారు పరిశీలించారు.

ఇదిలా ఉండగా, స్వామివారిని నేదునూరి సూర్యనారాయణ, అనంతలక్ష్మీ సత్యవతి దంపతులు (కొత్తపేట) దర్శించుకుని, వకుళమాత అన్నప్రసాద భవన నిర్మాణానికి రూ.లక్ష విరాళం సమర్పించారు. వారికి స్వామివారి చిత్రపటాన్ని దేవస్థానం సిబ్బంది అందజేశారు.

### ఎన్‌ఎంఎంఎస్‌కు 142 మంది ఎంపిక

రాయవరం: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్‌ఎంఎంఎస్)నకు జిల్లా వ్యాప్తంగా 142 మంది ఎంపికయ్యారు. జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో గత విద్యా సంవత్సరంలో 8వ తరగతి చదువుతున్న 2,688 మంది విద్యార్థులు ఎన్‌ఎంఎంఎస్ ప్రవేశ పరీక్షకు హాజరయ్యారు. వీరిలో 142 మంది అర్హత సాధించారు. వీరికి ఏడాదికి రూ.12 వేల వంతున నాలుగేళ్ల పాటు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తుంది. అర్హత పొందిన విద్యార్థులు ఈ నెల 25వ తేదీలోగా ఎన్‌ఎస్‌పీ పోర్టల్‌లో హెచ్‌టీటీపీఎస్://స్కాలర్‌షిప్స్.జీవోవీ.ఇన్/స్టూడెంట్స్ లింక్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని డీఈవో డాక్టర్ షేక్ సలీం బాషా తెలిపారు. 2023-24 విద్యా సంవత్సరంలో అర్హత పొంది, ప్రస్తుతం 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు కూడా ఈ ఏడాది స్కాలర్‌షిప్ పొందడానికి ఎన్‌ఎస్‌పీ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలి. 2022-23, 2021-22 విద్యా సంవత్సరాల్లో అర్హత సాధించి, ఇప్పుడు ఇంటర్ ఫస్టియర్, సెకండియర్ చదువుతున్న విద్యార్థులు గడచిన రెండు మూడేళ్లలో ఎక్కడా గ్యాప్ లేకుండా స్కాలర్‌షిప్ పొందితే ఆయా జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ ద్వారా ఎన్‌ఎస్‌పీ పోర్టల్‌లో ఈ నెల 25లోగా దరఖాస్తు చేసుకోవాలి. ఆయా విద్యార్థులు బ్యాంకు ఖాతా తెరచి, ఆధార్ సంఖ్యను అనుసంధానం చేసుకోవాలని డీఈఓ సూచించారు. డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) ద్వారా డబ్బులు నేరుగా జమయ్యేలా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ప్రభుత్వ వెబ్‌సైట్ నుంచి ప్రతిభా పత్రం డౌన్‌లోడ్ చేసుకున్న అనంతరం వారి పేరు, పుట్టిన తేదీ, తల్లిదండ్రుల పేర్లు ఒక్క అక్షరం కూడా పొరపాటు లేకుండా చూసుకుని ఆన్‌లైన్‌లో సమర్పించాలన్నారు. అనంతరం పాఠశాల నోడల్ అధికారి లాగిన్ ద్వారా ఆమోదం పొందాలన్నారు. ఆధార్ మిస్‌మ్యాచ్ వివరాలుంటే ప్రధానోపాధ్యాయుల ద్వారా తమ కార్యాలయానికి తెలియజేయాలని డీఈఓ బాషా సూచించారు.





నగరాల్లో కొబ్బరి, అరటి, చెరకు వంటి ఉత్పత్తులతో తయారు చేసిన స్వాగత ద్వారాలు



కొబ్బరి కాయలకు పసిడి వన్నెలద్ది, కొబ్బరి ఆకులతో ముస్తాబు చేసిన పెళ్లి వేదిక

# నయనానందం

- కొబ్బరాకుతో సెట్టింగ్‌లు
- పెళ్లి మండపాల డెకరేషన్‌లో ప్రాధాన్యం
- విభిన్న ఆకృతులతో ఆకట్టుకుంటున్న వైనం
- వాటితో పాటు పలు వ్యవసాయ ఉత్పత్తులకూ స్థానం

సాక్షి, అమలాపురం: ''కుక్కపిల్ల.. అగ్గిపుల్ల.. సబ్బు బిళ్ల.. కాదేదీ కవితకు అనర్హం'' అన్నట్టు కొబ్బరాకు.. కొబ్బరి కాయలు.. ధాన్యం కుచ్చులు.. చెరకు గెడలు.. అరటి చెట్లు.. అరటి ఆకులు.. పోక చెట్లు... ఆర్కిడ్‌లు.. ఇలా చెప్పుకొంటూ పోతే పెళ్లి మండపం... పెళ్లి స్వాగత ద్వారం ముస్తాబు చేయడానికి ఎటువంటి వ్యవసాయ ఉత్పత్తి అయినా కాదేదీ అనర్హం అంటున్నారు మండపాల తయారీదారులు. కొబ్బరాకులతో పెళ్లి మండపాల ముస్తాబు గోదావరి జిల్లాల్లో పెద్ద విషయం కాదు. అదిప్పుడు గోదావరి జిల్లాలు దాటుతోంది. ఇప్పుడు కొబ్బరాకుల ముస్తాబు కొత్త పుంతలు తొక్కుతోంది. ఆధునిక



అంబాజీపేట పెద్ద వీధిలో కొబ్బరి ఆకులతో తయారు చేసిన కళాకృతులు, కొబ్బరి కాయలు, చెరకు గెడలు, ధాన్యం కుచ్చులతో ముస్తాబు చేసిన పెళ్లి ఇంటి వద్ద స్వాగత ద్వారం



అరటి ఆకులతో ముస్తాబు చేసిన పెళ్లి కొడుకు, పెళ్లి కూతురును చేసే వేదికలు

హంగులు అద్దుకుంటోంది. పెళ్లిళ్ల డెకరేషన్‌లో పెరుగుతున్న హంగూ ఆర్భాటాల్లో సంప్రదాయానికి సైతం పెద్దపీట వేస్తున్నారు.

కొబ్బరాకులతో పెళ్లి పందిళ్లు వేయడం.. పందిళ్లకు వేసే రాటలను కొబ్బరాకులతో ముస్తాబు చేయడం గతం నుంచీ ఉన్నదే. పెళ్లిళ్లే కాదు.. గ్రామాల్లో జరిగే ఇతర శుభ కార్యక్రమాల్లోను, ఆలయాల వద్ద జరిగే కల్యాణాలు, యాగాలు వంటి వాటిల్లోను కొబ్బరాకు ముస్తాబు సర్వసాధారణమైంది. ఇప్పుడు అదే కొబ్బరాకుతో కొత్త కొత్త కళాకృతులు తయారు చేయడం ట్రెండ్‌గా మారింది. పెద్ద పెద్ద పెళ్లి మండపాల్లో కొబ్బరి ఆకులతో ముస్తాబు చేసేవారి సంఖ్య పెరుగుతోంది. పెళ్లి మండపాలు ఒక్కటే కాకుండా పెళ్లింటి వద్ద, కల్యాణ మండపాల వద్ద ఏర్పాటు చేసే స్వాగత ద్వారాలను సైతం ఈ ఆకులతో అందంగా తయారు చేస్తున్నారు. ఇప్పుడు వీటికి అదనంగా ఇతర వ్యవసాయ ఉత్పత్తులను జోడిస్తున్నారు. కొబ్బరి ఆకుల స్వాగత స్తంభాలను నెలకొల్పడంతో పాటు వాటికి చిన్న అరటి చెట్లను తగిలిస్తున్నారు. వీటికి అదనంగా కొబ్బరి కాయలు వేలాడదీస్తున్నారు. అక్కడక్కడ ధాన్యం కుచ్చులూ ఏర్పాటు చేస్తున్నారు. చెరకు గెడలతో ముస్తాబు చేయడమూ పెరిగింది. ఆర్కిడ్‌లు, చిలుక పువ్వులతో కొత్త అందాలు తీసుకువస్తున్నారు. కొబ్బరి వ్యాపార కేంద్రమైన అంబాజీపేటలో ఇటీవల జరిగిన ఒక పెళ్లిలో కొబ్బరి కాయలకు అందమైన రంగులద్ది స్వాగత ద్వారాలు ఏర్పాటు చేశారు. ఇటువంటి డెకరేషన్‌లు పెళ్లికి కొత్త జోష్ తీసుకు వస్తున్నాయి. చివరకు వధూవరులను అలంకరించే చోట కూడా వీటితోనే చిన్న చిన్న వేదికలు తయారు చేస్తుండటం విశేషం. కొబ్బరితో పాటు అరటి ఆకులతో సైతం వీటిని ముస్తాబు చేస్తున్నారు.

**ఇతర ప్రాంతాలకు సైతం..**

కొబ్బరి అధికంగా సాగయ్యే గోదావరి జిల్లాల్లోనే కాదు.. హైదరాబాద్, విజయవాడ, తిరుపతి, విశాఖపట్నం వంటి ప్రాంతాల్లో సైతం పెళ్లిళ్లకు కొబ్బరాకు స్వాగత ద్వారాలకు, పెళ్లి మండపాల ఆర్డర్లు వస్తున్నాయి. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలో కోనసీమ జిల్లాలో అమలాపురం, కొత్తపేట, ఆత్రేయపురం, అంబాజీపేట, రావులపాలెం, రాజమహేంద్రవరం, కడియం, కడియపులంక, పెరవలి, కాకరపర్రు వంటి ప్రాంతాల్లో కొబ్బరి ఆకులతో ప్రత్యేక ఆకృతులు తయారు చేసేవారి సంఖ్య రానురానూ పెరుగుతోంది. ఇక్కడ వీటిని తయారు చేయించి నగరాలలో జరిగే పెళ్లిళ్లకు తీసుకు వెళుతున్నారు. వీటితో పాటు పెళ్లిళ్ల డెకరేషన్‌లో వినియోగించే ఆర్కిడ్‌లు, చిలకపువ్వు, డయనల్ గ్రాస్, చిన్నచిన్న అరటి మొక్కలను రైతులు స్థానికంగానే పండిస్తున్నారు. కోనసీమ జిల్లాలో రావులపాలెం, కొత్తపేట, ఆత్రేయపురం, తూర్పు గోదావరి జిల్లాలో కొవ్వూరు, పెరవలి, చాగల్లు, కడియం వంటి ప్రాంతాల్లో కొబ్బరి తోటల్లో అంతర పంటగా సాగు చేసి రైతులు అదనపు ఆదాయం పొందుతున్నారు. పెళ్లిళ్లలో వస్తున్న ఈ కొత్త ట్రెండ్ ఇటు రైతులకు.. అటు డెకరేషన్ చేసేవారికి ఆదాయ వనరుగా మారుతోంది.

### అభిరుచి మారుతోంది



పెళ్లిళ్లు చేసేవారి అభిరుచి మారుతోంది. బాహుబలి వంటి సెట్టింగ్‌లే కాదు.. ఒకప్పటి సంప్రదాయాన్ని తలపించేలా కొబ్బరి, అరటి, ఇతర వ్యవసాయ ఉత్పత్తులతో సెట్టింగ్‌లు కావాలంటున్నారు. పెళ్లిళ్లలో అచ్చమైన పల్లె వాతావరణం కనిపించాలని కోరుకుంటున్నారు. వారి కోరికలకు అనువుగా కొబ్బరి, అరటి వంటి ఆకులతో సైతం కొత్తకొత్త మోడల్స్‌లో డెకరేషన్లు చేస్తున్నాం.

– బృందావనం నూకరాజు, ర్యాలి, ఆత్రేయపురం మండలం, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

### ప్రత్యేకంగా డెకరేషన్



కొబ్బరాకులతో తయారు చేసే కల్యాణ వేదికలు, స్వాగత ద్వారాలు హైదరాబాద్, విజయవాడ వంటి నగరాల నుంచి కూడా కావాలని కోరుతున్నారు. షాపింగ్ మాల్స్ వంటి ప్రారంభోత్సవాల్లో వీటితో ప్రత్యేకంగా డెకరేషన్ చేయించుకుంటున్నారు. చివరకు పెళ్లి కొడుకు, పెళ్లి కూతురు తయారు చేసే చిన్న వేదికల వద్ద కూడా వీటిని ప్రత్యేకంగా తయారు చేయించుకుంటున్నారు.

– మన్నెం సత్యనారాయణ, కాకరపర్రు, పెరవలి మండలం, తూర్పు గోదావరి జిల్లా

### రత్నగిరికి పోటెత్తిన భక్తులు

అన్నవరం: రత్నగిరికి ఆదివారం వేలాదిగా భక్తులు పోటెత్తారు. సత్యదేవుని ఆలయ ప్రాంగణం, క్యూలైన్లు, వ్రత, విశ్రాంతి మండపాలు నవ దంపతులు, వారి బంధుమిత్రులతో కిక్కిరిసిపోయాయి. సాయంత్రం వరకూ రద్దీ కొనసాగింది. సుమారు 40 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించి, పూజలు చేశారని అధికారులు తెలిపారు. వ్రతాలు 2,100 జరిగాయి. ఉచిత దర్శనానికి గంట, ప్రదక్షిణ దర్శనానికి అరగంట పట్టింది. సత్యదేవుని దర్శించిన భక్తులు సప్తగోకులంలో ప్రదక్షిణ చేసి, రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించి, పూజలు చేశారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం వచ్చిందని అధికారులు తెలిపారు. నిత్యాన్నదాన పథకంలో 5 వేల మంది భక్తులు సత్యదేవుని అన్నప్రసాదం స్వీకరించారు. ఉదయం నుంచీ వర్షం కురవడంతో సత్యదేవుడు, అమ్మవారి పల్లకీ సేవ ఆలయం లోపలి ప్రాకారంలో నిర్వహించారు.

# ఇది వెన్నుపోటు ప్రభుత్వం

- మోసాలకు, అబద్ధాలకు పేటెంట్ చంద్రబాబు
- వైఎస్సార్ సీపీ నేతల విమర్శ
- కూటమి ఏడాది పాలనా వైఫల్యాలపై పుస్తకావిష్కరణ

అమలాపురం టౌన్: ఇది వెన్నుపోటు ప్రభుత్వమని, నాడు ఎన్టీఆర్ నుంచి నేటి వరకూ చంద్రబాబు వెన్నుపోట్లతోనే అడ్డదారి రాజకీయాలు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ నేతలు ఆరోపించారు. వెన్నుపోటుకు ఆదిపురుషుడు, మోసాలకు, అబద్ధాలకు పేటెంట్ చంద్రబాబు అని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనా వైఫల్యాలపై వైఎస్సార్ సీపీ ముద్రించిన 'జగన్ అంటే నమ్మకం.. చంద్రబాబు అంటే మోసం' పుస్తకాన్ని స్థానిక హైస్కూలు రోడ్డులోని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు క్యాంపు కార్యాలయంలో పార్టీ నేతలు ఆదివారం ఆవిష్కరించారు. ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు, మాజీ మంత్రి, పార్టీ రాజోలు నియోజకవర్గ కో ఆర్డినేటర్ గొల్లపల్లి సూర్యారావు, రామచంద్రపురం, పి.గన్నవరం నియోజకవర్గాల కో ఆర్డినేటర్లు పిల్లి సూర్యప్రకాష్, గన్నవరపు శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి, ఇతర నాయకులు ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వెన్నుపోటు రాజకీయాలతో చంద్రబాబు.. రాష్ట్రంలోని 5 కోట్ల మంది ప్రజలను మోసగించారని విమర్శించారు. జగన్ అంటే ఓ నమ్మకమని, చంద్రబాబు అంటే మోసమనే విషయాన్ని రాష్ట్ర ప్రజలు గమనించారని చెప్పారు. ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అశాంతి, అలజడి సృష్టించి, అరాచకంగా మార్చిందని దుయ్యబట్టారు. రక్తపాతం, హింస, వేధింపులతోనే పాలన సాగించిందన్నారు. మహిళలు, బాలికలకు రక్షణ లేదన్నారు. హత్యలు, అత్యాచారాలు జరుగుతున్నా పోలీసులు రెడ్ బుక్ రాజ్యాంగానికే అధిక ప్రాధాన్యం ఇచ్చారని ఆరోపించారు. పాలనపై కంటే కక్ష సాధింపు పైనే ఎక్కువగా దృష్టి పెట్టి, తమకు నచ్చని వారిపై అక్రమ కేసులు పెడుతూ ప్రభుత్వం వేధించిందని గుర్తు చేశారు. ఎన్నికల హామీల ఎగవేత, అక్రమ కేసుల బనాయింపులతోనే ఏడాది పాలన సాగిందని చెప్పారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై రాష్ట్ర ప్రజలు బాహాటంగానే చర్చించుకుంటున్నారన్నారు. మళ్లీ జగన్ పాలన రావాలని అందరూ ఆకాంక్షిస్తున్నారని, బూటకపు హామీలు నమ్మి, దేవుడి లాంటి జగన్‌కు అన్యాయం చేశామన్న పశ్చాత్తాపం ప్రజల్లో కనిపిస్తోందని అన్నారు. కార్యక్రమంలో రావులపాలెం జెడ్పీటీసీ సభ్యుడు కుడుపూడి శ్రీనివాసరావు, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, రాష్ట్ర అగ్రికల్చర్ మిషన్ మాజీ సభ్యుడు జిన్నూరి బాబీ, పార్టీ జిల్లా కార్యదర్శి కముజు రమణ, సీనియర్ నాయకులు వంటెద్దు వెంకన్నాయుడు, కర్రి నాగిరెడ్డి, కుడుపూడి భరత్ భూషణ్ తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణ రావు, మాజీ మంత్రి సూర్యారావు, పార్టీ కో ఆర్డినేటర్లు

### ముగిసిన ఉపాధ్యాయుల కౌన్సెలింగ్



రాయవరం: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలో నిర్వహించిన ఉపాధ్యాయుల బదిలీల కౌన్సెలింగ్ ప్రక్రియ ఆదివారంతో ముగిసింది. గత నెల 21న గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయుల వెబ్ ఆప్షన్లతో ఈ ప్రక్రియ ప్రారంభమైంది. జిల్లాలో గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులు, భాషా పండితులు, ఫిజికల్ డైరెక్టర్లు, స్కూల్ అసిస్టెంట్ తదితర పలు క్యాడర్లకు సంబంధించి 5,010 మంది, సెకండరీ గ్రేడ్ క్యాడర్‌కు సంబంధించి 3,069 మంది దరఖాస్తు చేసుకున్నారు. ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్ క్యాడర్ల బదిలీ ప్రక్రియ వెబ్ ఆప్షన్ల ద్వారా చేపట్టగా, సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల బదిలీ విషయంలో కొంత ప్రతిష్టంభన ఏర్పడింది. ఉపాధ్యాయ సంఘాలతో ప్రభుత్వం నిర్వహించిన సమావేశంలో ఎస్‌జీటీలకు మాన్యువల్ విధానంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తామని చెప్పిన ప్రభుత్వం తిరిగి వెబ్ ఆప్షన్ల ద్వారానే చేస్తామని చెప్పడంతో ఉపాధ్యాయులు ధర్నాలు చేశారు. దీంతో ప్రభుత్వం ఈ నెల 10 నుంచి ఎస్‌జీటీలకు మాన్యువల్ విధానంలో కౌన్సెలింగ్ చేపట్టింది. ఈ నెల 14వ తేదీ అర్ధరాత్రితో ఈ ప్రక్రియ ముగిసింది. రెగ్యులర్ ఆర్ట్, డ్రాయింగ్, క్రాఫ్ట్, మ్యూజిక్, ఒకేషనల్ విభాగాలకు సంబంధించిన కౌన్సెలింగ్ ఆదివారం నిర్వహించారు. దీంతో మొత్తం ఉపాధ్యాయ బదిలీ ప్రక్రియ ముగిసినట్లయ్యింది. బదిలీ పొందిన గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లు ఇప్పటికే ఆయా స్థానాల్లో చేరారు. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో బదిలీ అయిన ఎస్‌జీటీలు ప్రస్తుతం పని చేస్తున్న స్థానాల్లో ఆదివారం రిలీవ్ అయి, సోమవారం ఆయా పాఠశాలల్లో చేరాలి. అన్ని యాజమాన్యాల్లోని ఎస్ఏ లాంగ్వేజెస్, ఎస్ఏ-పీఈ, ఎల్‌పీలు, పీఈటీలు బదిలీ అయిన స్థానాల్లో సోమవారం చేరాలి. ఎంపీపీ/జెడ్పీ యాజమాన్యాల పరిధిలోని ఎస్‌జీటీలు సోమవారం రిలీవ్ అయి, వారు బదిలీ పొందిన స్థానాల్లో చేరాలి. రిలీవ్ అయిన పాఠశాలలో సగం కంటే తక్కువ మంది ఉపాధ్యాయులు ఉంటే జీవోఎంఎస్ నంబర్-22 ప్రకారం జూనియర్ తిరిగి వెనక్కు వచ్చి పూర్వపు పాఠశాలలో పని చేయాల్సి ఉంటుంది.

# అధరహో..

- వెయ్యి కొబ్బరి కాయలకు రూ.18,500 రాబడి
- ఏకంగా రూ.27,500కు చేరిన కురిడీ రేటు
- కొబ్బరి మార్కెట్‌లో రికార్డుల మోత
- పచ్చికాయకు అనూహ్య డిమాండ్
- ధర మరింత పెరుగుతుందనే ఆశతో ఆచితూచి అమ్ముతున్న రైతులు

సాక్షి, అమలాపురం/ అంబాజీపేట: కొబ్బరి రైతులకు పంట పండింది. రెండు మూడు నెలలుగా కొబ్బరి, వాటి ఉత్పత్తుల ధరలు జాతీయ మార్కెట్‌లో రికార్డుల మోత మోగిస్తున్నాయి. ఇప్పటికే కురిడీ కొబ్బరి ధర రికార్డు స్థాయిలో పెరగగా.. ఇప్పుడు పచ్చి కొబ్బరి కాయలకు సైతం అదేవిధంగా ధర పలుకుతోంది. అంబాజీపేట మార్కెట్ చరిత్రలో ఇటు కురిడీ.. అటు కొబ్బరికి ఇవే అత్యధిక ధరలు కావడం గమనార్హం. స్థానికంగా దిగుబడులు తగ్గడంతో పాటు ఏడాదిన్నర కాలంగా రైతులు, వ్యాపారుల వద్ద నిల్వలు లేకపోవడంతో ధరలు రికార్డు స్థాయిలో పలుకుతున్నాయి.

**అంచనాలకు అందని విధంగా..**

ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో సుమారు 1.80 లక్షల ఎకరాల్లో కొబ్బరి సాగు జరుగుతోంది. ఒక్క కోనసీమ జిల్లాలోనే 1.10 లక్షల ఎకరాల్లో రైతులు కొబ్బరి సాగు చేస్తున్నారు. గత ఏడాది నుంచి పచ్చి కాయ, ముక్కుడు కాయల (నిల్వ కాయ) ధర వెయ్యికి రూ.10 వేలకు ఎప్పుడూ తగ్గలేదు. తరువాత ఈ ధర క్రమంగా పెరుగుతూ వస్తోంది. గత నెలలో ఒకానొక సమయంలో రూ.12 వేల వరకూ ఉండగా తరువాత నెమ్మది నెమ్మదిగా పెరుగుతూ రూ.16 వేలకు చేరింది. ఇదే గరిష్ఠ ధర అనుకోగా, రైతులు, వ్యాపారులు అంచనాలకు మించి ఏకంగా రూ.17,500 నుంచి రూ.18,500 వరకూ పెరిగింది. అంబాజీపేట మార్కెట్‌లో వెయ్యి పచ్చి కొబ్బరి కాయకు గతంలో రూ.16 వేల నుంచి రూ.17 వేల వరకూ గరిష్ఠ ధర లభించేది. అలాగే కురిడీ కొబ్బరి కాయ ధర సైతం వెయ్యికి రూ.20 వేలు గరిష్ఠంగా వచ్చేది. అటువంటిది తొలిసారిగా ఇటు కొబ్బరి కాయకు, అటు కురిడీ కాయకు ఒకేసారి రికార్డు స్థాయి ధర లభిస్తోంది. మన రాష్ట్రం ఉంచి ఉత్తరాదిలోని గుజరాత్, హర్యానా, మహారాష్ట్రతో పాటు బిహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు పచ్చికాయ ఎగుమతి అధికంగా జరుగుతోంది.

**ధర ఎందుకు పెరుగుతోందంటే..**

- గతంలో దిగుబడిగా వచ్చిన కొబ్బరి కాయలు రెండు మూడు నెలలు రైతుల వద్దనే ఉండేవి. కానీ, ధరలు ఆశాజనకంగా ఉండటంతో ఏడాది కాలంగా ఇటు రైతులు, అటు వ్యాపారుల వద్ద నుంచి వారం రోజుల వ్యవధిలోనే కాయలు ఎగుమతి అవుతున్నాయి. దీంతో, నిల్వలు లేక కొబ్బరి, కురిడీ కొబ్బరికి డిమాండ్ గణనీయంగా పెరిగింది.
- తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లో కొబ్బరి దిగుబడి గణనీయంగా తగ్గింది. తమిళనాడు నుంచి జాతీయ మార్కెట్‌కు ఎగుమతి అయ్యే కొబ్బరిలో మూడో వంతు కూడా అందుబాటులో లేకుండా పోయింది. దీంతో, ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల నుంచి ఉత్తరాదికి కొబ్బరి కాయల ఎగుమతులు పెరిగాయి. ఫలితంగా గత మార్చి నెల నుంచి గోదావరి జిల్లాల కొబ్బరికి డిమాండ్ ఏర్పడింది.
- మార్చి నుంచి మే నెలాఖరు వరకూ ఎకరాకు సగటున 1,200 కాయల వరకూ దిగుబడి వస్తుంది. తరువాత అది తగ్గుతుంది. ప్రస్తుతం సగటు దిగుబడి 700 కాయల వరకూ ఉంది. అంటే కాయల లభ్యత తగ్గిందన్నమాట.
- సాధారణంగా ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల నుంచి సీజన్‌లో రోజుకు 130 నుంచి 150 వరకూ లారీల్లో పచ్చి కొబ్బరి ఉత్తరాది రాష్ట్రాలకు ఎగుమతి అవుతుందని అంచనా. అన్‌సీజన్‌లో 70 నుంచి 90 లారీల వరకూ ఎగుమతులు జరుగుతాయి. ప్రస్తుతం దిగుబడి తగ్గడంతో అన్‌సీజన్ కంటే తక్కువగా రోజుకు 50 నుంచి 60 లారీల ఎగుమతులు మాత్రమే జరుగుతున్నాయి. ఈ ప్రాంతం నుంచి కురిడీ కొబ్బరి ఎగుమతి సైతం తక్కువే. గతంలో రోజుకు 25 లారీల వరకూ ఎగుమతి కాగా, ఇప్పుడు రోజుకు 15 లారీల వరకూ జరుగుతోందని అంచనా. ఈవిధంగా స్థానికంగా దిగుబడి తగ్గడంతో ధర పెరుగుతోంది.
- ధర ఇంతలా పెరిగినప్పటికీ.. మరింత పెరగవచ్చనే అంచనాతో రైతులు ఆచితూచి విక్రయిస్తున్నారు. ఇది కూడా కొబ్బరి ధరలు పెరగడానికి కారణమవుతోంది.



కురిడీ కొబ్బరి వలుస్తున్న కార్మికుడు

### కురిడీకి రికార్డు స్థాయి ధర

కురిడీ కొబ్బరికి సైతం మార్కెట్‌లో రికార్డు స్థాయి ధర పలుకుతోంది. ఎనిమిది నెలలకు పైబడి నిల్వ ఉన్న పాత కాయల్లో గండేరా రకం (పెద్ద రకం) వెయ్యి కురిడీ కొబ్బరి కాయల ధర ఏకంగా రూ.27,500కు చేరింది. గతంలో దీని సగటు ధర రూ.14 వేలు మించేది కాదు. ఇక గటగట (చిన్న కాయ) ధర రూ.25,500 పలుకుతోంది. కొత్త కాయల్లో గండేరా రూ.26,500, గటగట రూ.24,500కు పెరిగింది.

### ఈ స్థాయి ధర ఊహించలేదు



కురిడీ కొబ్బరికి ఈ స్థాయిలో ధరలు రావడం ఇంతకు ముందెన్నడూ చూడలేదు. మేము కురిడీ వ్యాపారం మొదలు పెట్టిన తరువాత గండేరా, గటగటాలకు ఇంత ధర రావడం ఇదే మొదటిసారి.

– అప్పన శ్యామ్, కురిడీ కొబ్బరి వ్యాపారి, అంబాజీపేట

## క్లుప్తంగా

### అమెరికాలో ఎమ్మెస్ టాపర్‌గా అమలాపురం మహిళ


చావలి శ్రీకావ్య

అమలాపురం టౌన్: అమెరికా దేశం వాషింగ్టన్ విశ్వవిద్యాలయానికి చెందిన ఫాస్టర్ స్కూల్ ఆఫ్ బిజినెస్ నుంచి అమలాపురం మహిళ చావలి శ్రీకావ్య ఎమ్మెస్ డిగ్రీలో టాపర్‌గా నిలిచింది. ఆమె కోనసీమ సైన్స్ పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ సీవీ సర్వేశ్వరశర్మ మనమరాలు. అమెరికాలోని ఆ స్కూల్‌లో శనివారం జరిగిన కాన్వగేషన్‌లో శ్రీకావ్యకు ఎమ్మెస్ డిగ్రీతోపాటు మాస్టర్ ఆఫ్ సప్లై చైన్ మేనేజ్‌మెంట్ డిగ్రీ ప్రదానం చేశారు. శ్రీకావ్య ఇప్పటికే వివిధ దేశాల్లో పోస్ట్ గ్రాడ్యుయేట్స్ చేసింది. హైదరాబాద్ జేఎన్టీయూ నుంచి ఎంటెక్, స్వీడన్ బ్లెకింజ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి టెలీ కమ్యూనికేషన్స్ సిస్టమ్‌లో ఎమ్మెస్ డిగ్రీ చేసింది. కోచ్ కోడ్ ఇండియన్ ఇనిస్టిట్యూట్ నుంచి ఎంబీఏ చేసింది. ఈ ఇనిస్టిట్యూట్‌లో శ్రీకావ్య ఆటోమేషన్ ఆఫ్ క్లౌడ్ హోస్టెడ్ అప్లికేషన్స్ అనే పరిశోధనా పత్రాన్ని సమర్పించింది. ఈమె స్పోర్ట్స్‌లో కూడా విజేత. జాతీయ స్థాయి ఎయిర్ రైఫిల్ షూటర్‌గా, తెలంగాణ రాష్ట్రం నుంచి అఖిల భారత పది మీటర్ల మహిళా షూటింగ్ చాంపియన్ షిప్ గెలుచుకుంది.

### అదృశ్యమైన వ్యక్తి 18 రోజులకు ప్రత్యక్షం

పిఠాపురం: అప్పుల బాధ భరించలేక ఇల్లు వదిలి వెళ్లిపోయిన వ్యక్తి 18 రోజుల అనంతరం క్షేమంగా ఇంటికి చేరుకున్నాడు. తమను వదిలి వెళ్లిపోయిన తండ్రి ఫాదర్స్ డే నాడు తిరిగి రావడంతో పిల్లలు ఆనందం వ్యక్తం చేశారు. సీఐ శ్రీనివాస్ కథనం ప్రకారం.. పిఠాపురం ఏడు కాలువల ప్రాంతానికి చెందిన గీసాల శ్రీనివాస్ గత నెల 29న ధవళేశ్వరంలో ఎవరో డబ్బులు ఇవ్వాలని చెప్పి తన స్నేహితుడైన కాకి రమణ బైక్ తీసుకు వెళ్లాడు. తర్వాత రోజు సాయంత్రం 4 గంటల వరకు తన భార్యతో ఫోన్లో మాట్లాడాడు. అనంతరం తన సెల్ స్విచ్ఛాఫ్ వచ్చింది. అనుమానం వచ్చి బంధువుల సహాయంతో వెతకగా ధవళేశ్వరం బ్యారేజీపై తాను తీసుకెళ్లిన బైక్, దుస్తుల బ్యాగు, చెప్పులు కనిపించాయి. దీంతో ఆయన భార్య గీసాల లక్ష్మి పిఠాపురం పోలీసులకు ఫిర్యాదు చేయగా దర్యాప్తు ప్రారంభించారు. సాంకేతిక పరిజ్ఞానంతో విచారణ చేయగా శ్రీనివాస్ ధవళేశ్వరం బ్యారేజీ వద్ద తన వస్తువులను వదిలి రైల్వే స్టేషన్ వరకూ వెళ్లినట్లు సీసీ పుటేజీ ద్వారా తెలుసుకున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం శ్రీనివాస్ పిఠాపురంలో తన ఇంటికి చేరుకున్నాడు. 18 రోజుల తరువాత అదీ ఫాదర్స్‌డే నాడు ఇంటికి చేరుకోవడంతో అతని పిల్లలు ఆనందం వ్యక్తం చేశారు. అప్పుల బాధ నుంచి విముక్తి పొందాలనే ఉద్దేశంతో కాశీకి వెళ్లినట్లు శ్రీనివాస్ తెలిపాడు.


గీసాల శ్రీనివాస్ కుటుంబ సభ్యులతో పోలీసులు

# అన్నంత సేవ

- రోజూ మూడు వేల మందికి అన్నదానం
- దాతల సహకారంతో నిర్మలగిరిలో సేవ
- 24 ఏళ్లుగా కొనసాగుతున్న కార్యక్రమం

దేవరపల్లి: మది నిండా భక్తితో.. ఎక్కడెక్కడి నుంచో.. ఆ నిర్మలగిరికి వస్తున్న భక్తుల ఆకలి తీర్చే నిత్యాన్నదాన కార్యక్రమం నిర్విరామంగా సాగుతోంది.. భక్తులు, దాతల విరాళాలతో నిత్యం ఈ కార్యక్రమం నిరాటంకంగా జరుగుతోంది. ఈ సేవ 24 ఏళ్లుగా సాగుతుండడం ప్రాముఖ్యతను చాటుతోంది. తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం గౌరీపట్నం నిర్మలగిరి మేరీమాత పుణ్యక్షేత్రం వద్ద ప్రత్యేకత ఇది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ప్రముఖ క్రైస్తవ పుణ్యక్షేత్రంగా దినదినాభివృద్ధి చెందుతుంది. ఈ పుణ్యక్షేత్రానికి దూర ప్రాంతాల నుంచి అనేక మంది భక్తులు వస్తుంటారు. వారి ఆకలి తీర్చడానికి ఏలూరు మేత్రాసనం పీఠాధిపతులు మోస్ట్ రెవరెండ్ జయరావు పొలిమెర ఆధ్వర్యంలో పుణ్యక్షేత్రం డైరెక్టర్ రెవరెండ్ ఫాదర్ ఎస్.జాన్‌పీటర్ పర్యవేక్షణలో నిత్యాన్నదానం విజయవంతంగా జరుగుతోంది.

**అప్పటి నుంచి ఇప్పటి వరకూ..**

నిర్మలగిరి పుణ్యక్షేత్రంలో 2020–21లో అప్పటి డైరెక్టర్ రెవరెండ్ ఫాదర్ ఆరోన్ దిరిసిన ఆధ్వర్యంలో నిత్యాన్నదాన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కొండపైన ఉన్న క్రీస్తు ఆలయం సమీపంలో అన్ని వసతులతో కూడిన సువిశాల భోజనశాల నిర్మించారు. భోజన శాలను అప్పటి ఏలూరు పీఠాధిపతులు రెవరెండ్ జాన్‌ములగాడ ప్రారంభించారు. తొలుత 200 మందితో ప్రారంభించి... నేడు వేలాది మంది భక్తుల ఆకలి తీర్చుతున్నారు. రోజూ మూడు వేల మంది భక్తులకు అన్నదానం నిర్వహిస్తుండగా, ఆదివారం సుమారు పది వేల మందికి జరుగుతోంది. సుమారు 24 ఏళ్లుగా నిత్యాన్నదానం నిర్విరామంగా కొనసాగుతుంది. డైరెక్టర్ ఫాదర్ జాన్‌పీటర్ పర్యవేక్షణలో కళ్లే నాగేశ్వరరావు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

**అయ్యప్ప మాలధారులకూ..**

**క్రైస్తవ పుణ్యక్షేత్రం అయినప్పటికీ ఇక్కడ అన్నిమతాల భక్తులకు అన్నదానం చేస్తున్నారు. ప్రతి ఏటా కార్తీక మాసంలో అయ్యప్పమాల, భవానీ మాలలు** ధరించిన భక్తులు పుణ్యక్షేత్రానికి చేరుకుని అన్నప్రసాదం స్వీకరించడం ఇక్కడ విశేషం. అక్టోబర్ నుంచి జనవరి వరకూ ఎక్కువ మంది అయ్యప్ప మాల ధారణ, భవానీ దీక్ష భక్తులు అన్నప్రసాదం స్వీకరించి పుణ్యక్షేత్రంలో విశ్రాంతి తీసుకుని వారి ప్రయాణం కొనసాగిస్తున్నారని నిర్వాహకులు తెలిపారు. రోజూ మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 3.30 గంటల వరకు అన్నదానం జరుగుతుంది. ఎంత మంది భక్తులు వచ్చినా లేదనకుండా భోజనం పెట్టడం ఇక్కడ ప్రత్యేకత. నిర్మలగిరి సాంబారుకు మంచి గుర్తింపు ఉంది. ఈ సాంబారు రుచి అమోఘమని భక్తులు అంటుంటారు. మినరల్ వాటర్‌తో వంటకాలు తయారు చేసి నాణ్యమైన భోజనం భక్తులకు అందిస్తున్నారు. ఒక రౌండుకు సుమారు 750 మంది భక్తులు భోజనం చేసే విధంగా ఏర్పాట్లు చేశారు.


దేవరపల్లి మండలం నిర్మలగిరి మేరీమాత పుణ్యక్షేత్రంలో నిత్యాన్నదానం

**పోషకాహారం.. రుచికరం**

పోషకాలతో కూడిన రుచికరమైన ఆహారం భక్తులకు అందిస్తున్నారు. నగదుతో పాటు కూరగాయలు, నిత్యావసర సరకులు, బియ్యం వంటివి దాతలు నిత్యాన్నదానానికి అందిస్తూ తమ వంతు సహకరిస్తున్నారు. అన్నదానానికి రూ.వెయ్యి కంటే పైబడి విరాళం అందించిన దాతల పేరున ఏటా ఒకరోజు భక్తులకు అన్నదానం చేసి ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

**వేసవిలో చల్లచల్లగా..**

భక్తులకు వేసవిలో చల్లని నీటిని సరఫరా చేస్తున్నారు. పుణ్యక్షేత్రంలో తలనీలాల కాంట్రాక్టర్, అన్నదాన కార్యక్రమం నిర్వాహకుడు కళ్లే నాగేశ్వరరావు తన భార్య లలిత జ్ఞాపకార్థం నిత్యాన్నదాన భోజన శాల వద్ద కూలింగ్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. వేసవిలో భక్తులకు ఇక్కడ చల్లని నీటిని అందజేస్తున్నారు.


నిర్మలగిరి మేరీమాత పుణ్యక్షేత్రంలో నిత్యాన్నదాన శాల

### దాతలు సహకరించాలి



నిర్మలగిరి పుణ్యక్షేత్రంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదానానికి దాతలు సహకరించాలి. ఇప్పటికే అనేక మంది దాతలు, భక్తులు విరాళాలు అందజేస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి పుణ్యక్షేత్రానికి రోజూ వేలాది మంది వస్తున్నారు. వారికి ఇబ్బంది రాకుండా నిత్యాన్నదానం చేస్తున్నాం. అంతేకాకుండా పేదలకు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. మానవ సేవే.. మాధవ సేవగా భావించి ముందుకు వెళ్తున్నాం.

–మోస్ట్ రెవరెండ్ జయరావు పొలిమెర, పీఠాధిపతులు, ఏలూరు

### భవిష్యత్తులో మరింత విస్తరిస్తాం..



దాతలు, పీఠాధిపతులు జయరావు పొలిమెర సహకారంతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. రోజూ 3 వేల మంది భక్తులకు అన్నదానం చేస్తున్నాం. అన్ని మతాలకు చెందిన భక్తులు అన్నదానం కార్యక్రమానికి సహకరిస్తున్నారు. కార్తిక మాసంలో అయ్యప్ప, భవానీ భక్తులు కూడా ఇక్కడ అన్నప్రసాదం స్వీకరిస్తున్నారు. భవిష్యత్తులో దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమాన్ని మరింత విస్తరిస్తాం.

–రెవరెండ్ ఫాదర్ ఎస్.జాన్‌పీటర్, డైరెక్టర్, నిర్మలగిరి పుణ్యక్షేత్రం, గౌరీపట్నం

# కామేశ మహర్షి కారణజన్ములు



సంస్మరణ సభలో భక్తులు

పీఠాధిపతి కామేశ మహర్షి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పీఠం ప్రేమ మందిరం అమ్మ వాణి

అమలాపురం టౌన్: స్థానిక శ్రీకామాక్షీ పీఠాధిపతి కామేశ మహర్షి కారణజన్ములని, వందలాది మంది అనాథ బాల బాలికలకు ఆశ్రయం కల్పించిన మానవతావాదని భక్తులు ముక్త కంఠంతో అన్నారు. శ్రీకామాక్షీ దేవి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పీఠంలో ఆదివారం జరిగిన కామేశ మహర్షి సంస్మరణ సభలో అనేక మంది భక్తులు పీఠాధిపతి సేవలను స్మరించారు. ట్రస్ట్ సభ్యుడు, న్యాయ సలహాదారు వీరా నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సంస్మరణ సభకు సాహితీవేత్త డాక్టర్ ఎస్ఆర్ఎస్ కొల్లూరి అతిథిగా పాల్గొని మాట్లాడుతూ పీఠాధిపతి కామేశ మహర్షి దాదాపు 40 ఏళ్లకు పైగా పీఠం ద్వారా ఆధ్యాత్మిక, సామాజిక సేవలు అందించారన్నారు. చారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ, పీఠంలో అనాథ పిల్లలు పెరిగే ప్రేమ మందిరం అమ్మ వక్కలంక వాణి మాట్లాడుతూ కామేశ మహర్షి సేవలను స్మరిస్తూ కన్నీటి పర్యంతం అయ్యారు. కామేశ మహర్షి సమాజ హితాన్ని కాంక్షించే వారని పీఠం ఉత్తరాధికారి విఘనస రాఖీ ప్రేమ్ అన్నారు. పీఠం బ్రహ్మ గోవిందవర్జుల నాగబాబు మాట్లాడుతూ భౌతికంగా పీఠాధిపతి మనకు దూరమైనా ఆయన ఆశయాలు, లక్ష్యాల సాధన కోసం నిరంతరం పాటుపడాలన్నారు. పీఠం మేనేజర్ మద్రి దుర్గారావు, ఎస్‌కేబీఆర్ కళాశాల ప్రిన్సిపాల్ నూకల శ్రీనివాస్, కోనసీమ చిత్రకళా పరిషత్ అధ్యక్షుడు కొరసాల సీతారామస్వామి, విద్యానిధి విద్యా సంస్థల చైర్మన్ ఏబీ నాయుడు, ట్రస్ట్ సభ్యుడు మట్టపర్తి సత్యనారాయణ, జ్యోతిష పండితుడు కర్రా వీరభద్రం, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు యర్రమిల్లి పాండు రంగారావు తదితరులు ప్రసంగించి కామేశ మహర్షి సేవా ప్రస్థానాన్ని వివరించారు. తొలుత కామేశ మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వివిధ సంస్థల ప్రతినిధులు భమిడిపాటి కృష్ణమూర్తి, వెంకటరెడ్డి, సతీష్, కూచిమంచి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# చేపలోచ్చాయోచ్..


కాకినాడ ఏటిమొగ వద్ద చేపల వేటకు ముందు గంగమ్మ తల్లికి పూజ కోసం కలశాలతో ఊరేగింపు


25 కిలోల బరువున్న గుమ్మడి పార చేపతో ఓ వ్యక్తి

- వేటకు వెళ్లిన తొలిరోజు బోణీ అదుర్స్
- మత్స్యకారుల వలలకు భారీ చేపలు

కాకినాడ రూరల్: సముద్రంలో వేట నిషేధం ముగిసింది. దీంతో శనివారం అర్ధరాత్రి నుంచి మత్స్యకారులు బోట్లతో వేటకు వెళ్లారు. కొందరు మత్స్యకారులు ఆదివారం ఉదయమే వేట ముగించుకుని రాగా, వారి వలలకు భారీ సైజు చేపలు చిక్కాయి. కాకినాడ కుంభాభిషేకం రేవు వద్దకు భారీ కొమ్ము కోనం చేపను బోట్ నుంచి క్రేన్ సహాయంతో అమ్మకానికి తీసుకువచ్చారు. దీని బరువు సుమారు 350 కిలోలు ఉంటుందని అంచనా. దీని ధర రూ.37 వేలు పలికింది. కొందరు మత్స్యకారులకు పెద్ద సైజు గుమ్మడి పార చేపలు చిక్కాయి. సుమారు 25 కిలో బరువున్న చేపను మత్స్యకారులు తీసుకురావడంతో అంతా ఆసక్తిగా తిలకించారు. కోనసీమ జిల్లాకు చెందిన వ్యాపారి కిలో సుమారు రూ.250 పైబడి ధరతో దీనికి కొనుగోలు చేశారు. వాతావరణం బాగోక చేపలు పడడం లేదని, అన్ని బోట్లు వేటకు వెళ్లలేదని మత్స్యకారులు చెబుతున్నారు. మరోవైపు కాకినాడ జగన్నాథపురం ఏటమొగ వద్ద మోటరైజ్డ్ బోట్లు (సోనా) ఆదివారం గంగమ్మ తల్లికి పూజల అనంతరం రాత్రికి వేటకు పయనమయ్యాయి.

### అంబాజీపేట కొబ్బరి మార్కెట్



| కొబ్బరి రకం | ధర (రూ.ల్లో) |
|---|---|
| కొత్తకొబ్బరి (క్వింటాల్) | 18,000 – 18,500 |
| కొత్తకొబ్బరి (రెండవ రకం) | 10,500 – 12,000 |
| **కురిడీ కొబ్బరి (పాతవి)** | |
| గండేరా (వెయ్యి) | 27,500 |
| గటగట (వెయ్యి) | 25,500 |
| **కురిడీ కొబ్బరి (కొత్తవి)** | |
| గండేరా (వెయ్యి) | 26,500 |
| గటగట (వెయ్యి) | 24,500 |
| నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి) | 17,000 – 17,500 |
| కొత్త (పచ్చి)కాయ (వెయ్యి) | 18,000 – 18,500 |
| కొబ్బరి నూనె (15 కిలోలు) | 3,750 |
| ఒక కిలో | 260 |

# మరణంలోనూ వీడని బంధం

- వివాహమైన నెల రోజులకే మృత్యు ఒడికి..
- రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తల దుర్మరణం

గాజువాక: వివాహమైన నెల రోజులకే ఒక జంట మృత్యు ఒడికి చేరింది. విశాఖ జిల్లా గాజువాకలో సరదాగా షికారు చేసి వద్దామనుకొని బయల్దేరిన కొత్త జంట రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలైంది. గాజువాక ట్రాఫిక్ పోలీసుల కథనం ప్రకారం.. కాకినాడ జిల్లా పిఠాపురానికి చెందిన జొన్నాడ సాయి (27), పెదగంట్యాడ మండలం గంగవరం గ్రామానికి చెందిన శాలిని (25) గాజువాకలోని యాపిల్ డయాగ్నోస్టిక్ సెంటర్‌లో ల్యాబ్ టెక్నీషియన్లుగా పని చేస్తున్నారు. వీరిద్దరూ ప్రేమించుకుని నెల రోజుల కిందట పెద్దల సమక్షంలో వివాహం చేసుకున్నారు. ఆదివారం మధ్యాహ్నం ల్యాబ్‌కు సెలవు కావడంతో షికారు కోసం నగరంలోకి వెళ్లేందుకు ద్విచక్ర వాహనంపై బయల్దేరారు. ములగాడ మీదుగా పోర్టు రోడ్‌లోని మారుతీ సర్కిల్ వద్ద వెనుకనే వస్తున్న ఒక ట్రాలర్ వారిని ఢీకొని ఈడ్చుకుపోయింది. ఈ ప్రమాదంలో సాయి అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. తీవ్ర గాయాలైన శాలినిని షీలానగర్‌లోని కిమ్స్ ఆస్పత్రికి తరలించగా అక్కడ మృతి చెందిందని పోలీసులు తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు సీఐ కోటేశ్వరరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా.. ఇదే రోడ్డులో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆయిల్ ట్యాంకర్ కింద పడి ఇద్దరు నేవీ వైద్యులు దుర్మరణం పాలైన సంగతి తెలిసిందే. 24 గంటల వ్యవధిలో నలుగురు మృత్యువాత పడటం.. వారి కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపింది.

### రైలు నుంచి జారిపడి మహిళ మృతి


ముత్యాలమ్మ (ఫైల్)

తుని: రైలు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు స్థానిక జీఆర్పీ ఎస్సై శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. తుని మండలం తాళ్లూరుకు చెందిన గండి ముత్యాలమ్మ (53) తుని రైల్వే స్టేషన్లో కాకినాడ నుంచి విశాఖపట్నం వెళ్లే మెమూ రైలు ఎక్కింది. రైలు తలుపు దగ్గర నిల్చున్న ముత్యాలమ్మ ప్రమాదవశాత్తూ జారిపడి కిందపడి అక్కడికక్కడే మృతి చెందింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు జీఆర్పీ ఎస్సై తెలిపారు.

# తల్లి, కుమార్తె, కుమారుడి అదృశ్యం


హారతి, ఆమె కుమార్తె, కుమారుడు నందన, భార్గవ్

అమలాపురం టౌన్: మండలంలోని పేరూరు గ్రామ శివారు దూడలవారి వీధికి చెందిన చవ్వాకుల హారతి (24), ఆమె కుమార్తె నందన (6), కుమారుడు భార్గవ్ (4) అదృశ్యమయ్యారు. వీరు శనివారం సాయంత్రం 3.30 గంటలకు ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. హారతి భర్త నగేష్ తన భార్య, పిల్లల ఆచూకీ కోసం ఆమె పుట్టింటి వారిని, స్నేహితులు, బంధువులను వాకబు చేసినా ఫలితం లేకపోవడంతో శనివారం రాత్రి అమలాపురం పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. భర్త నరేష్ కొబ్బరి ఒలుపు కార్మికుడిగా పని చేస్తున్నాడని, భార్యభర్తల మధ్య గొడవలు ఉన్నాయని పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపారు. సీఐ కథనం ప్రకారం ... హారతి ఇంటి నుంచి తన ఎలక్ట్రికల్ స్కూటీపై పిల్లలను ఎక్కించుకుని తన పుట్టినిల్లు మామిడికుదురు మండలం లూటుకుర్రు వెళ్లింది. హారతి కొద్ది సేపటికే తన పిల్లలతో తిరిగి అమలాపురం బయలుదేరింది. అమలాపురం ఆర్టీసీ బస్టాండ్‌కు వచ్చి అక్కడి సైకిల్ స్టాండ్‌లో తన స్కూటీని పెట్టి పిల్లలతో సహా వెళ్లిపోయింది. పట్టణ పోలీసులు శనివారం రాత్రి 11 గంటల సమయంలో హారతి ఆర్టీసీ బస్టాండ్ వద్ద సైకిల్ స్టాండ్‌లో తన స్కూటీని పెట్టినట్లు గుర్తించారు. తర్వాత ఆమె తన పిల్లలతో బస్సు ఎక్కి ఏదో ఊరు వెళ్లినట్లు గమనించారు. భర్త నరేష్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు, ఆమెతోపాటు పిల్లల కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు సీఐ వీరబాబు తెలిపారు. ఆ తల్లీ బిడ్డల ఆచూకీ తెలిసిన వారు పట్టణ సీఐ 94407 96561, ఎస్సై 79811 66996 ఫోన్లకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

### వృద్ధుడి ఆత్మహత్య

తుని: స్థానిక వెలమకొత్తూరు పెద్ద రైల్వే గేటు వద్ద ఓ వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నట్లు తుని జీఆర్పీ ఎస్సై జి.శ్రీనివాసరావు తెలిపారు. ఆయన వివరాల మేరకు.. పాయకరావుపేట రాజుగారి బీడుకు చెందిన అయినవిల్లి నాగరాజు (80) ఎంపీడీఓ కార్యాలయంలో క్లర్కుగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందాడు. మృతుడు తొమ్మిదేళ్లుగా క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. శనివారం సాయంత్రం విశాఖపట్నం అపోలో ఆసుపత్రికి చికిత్స కోసం వెళుతున్నానని కుటుంబ సభ్యులకు చెప్పాడు. క్యాన్సర్ బాధ తట్టుకోలేక రాజమహేంద్రవరం నుంచి విశాఖపట్నం వెళుతున్న రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించి, పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు శ్రీనివాసరావుచెప్పారు.

### జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపిక


కోచ్ లక్ష్మణరావుతో ఐశ్వర్య సూర్యదీపిక

పిఠాపురం: జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలకు పిఠాపురం క్రీడాకారిణి ఎంపికైనట్లు కోచ్ పి.లక్ష్మణరావు ఆదివారం తెలిపారు. స్థానికంగా ఆయన మాట్లాడుతూ మే నెల 30, 31వ తేదీల్లో విశాఖపట్నంలో జరిగిన రాష్ట్ర స్థాయి జూనియర్ బాలికల బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో 80+ కిలోల విభాగంలో పిఠాపురానికి చెందిన జె.ఐశ్వర్య సూర్యదీపిక రజిత పతకం సాధించిందన్నారు. అదే పోటీల్లో విజయనగరానికి చెందిన బాక్సర్ స్వర్ణ పతకం సాధించింది. ఆమె జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. అనివార్య కారణాలతో విజయనగరం బాక్సర్ పోటీల నుంచి తప్పుకుంది. దీంతో తరువాత స్థానంలో ఉన్న పిఠాపురం బాక్సర్ ఐశ్వర్య సూర్యదీపికకు ఈ అవకాశం దక్కిందన్నారు. ఈ నెల 19 నుంచి 26 తేదీ వరకు హర్యానా రాష్ట్రం రోతక్‌లో జరగనున్న జాతీయ స్థాయి 6వ జూనియర్ బాలికల బాక్సింగ్ పోటీలకు పిఠాపురం నుంచి ఆంధ్రప్రదేశ్ జట్టు తరపున సూర్యదీపిక పాల్గొంటుందని కోచ్ వివరించారు. ఈ సందర్భంగా ఆమెను డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ బి.శ్రీనివాస్‌కుమార్, ద్రోణాచార్య అవార్డు గ్రహీత ఐ.వెంకటేశ్వరరావు, కె.పద్మనాభం అభినందించారు.

# దేవఆదాయ భూములు


పలివెల దేవస్థానం భూమిలో మట్టి అక్రమ తవ్వకాలు

- యథేచ్ఛగా మట్టి దోపిడీ
- పలివెల భూముల్లో అక్రమ తవ్వకాలు

కొత్తపేట: దేవదాయ భూముల్లో మట్టి అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. కొత్తపేట మండలం పలివెల పంచాయతీ పరిధిలో దేవదాయ– ధర్మదాయ శాఖ ధర్మసత్రం, ఉమా కొప్పేశ్వరస్వామివారి దేవస్థానం భూముల్లో మట్టిని అనుమతులు లేకుండా తవ్వి, తరలిస్తున్నారు. పలివెల ధర్మ సత్రానికి ఆ గ్రామ శివారు నక్కల కాలువకు ఆనుకుని 5.38 ఎకరాల వరి (పల్లం) భూమి ఉంది. దానిని గత వేలం పాటల్లో అదే గ్రామ శివారు పూజారిపాలెం గ్రామానికి చెందిన ఒక రైతు కౌలుకు పాడుకున్నారు. ఆ భూమిలో ఆ రైతు మూడు రోజులుగా జేసీబీతో మట్టిని తవ్వి, ట్రాక్టర్లపై తరలిస్తున్నారు. ట్రాక్టర్ల లెక్కన మట్టిని పెద్ద మొత్తానికి విక్రయించినట్టు సమాచారం. ఈ మట్టి అక్రమ తవ్వకాలు, తరలింపుపై స్థానికులు సంబంధిత శాఖ స్థానిక అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని, పైగా అది తమ భూమి కాదు.. ప్రైవేట్ భూమి అని చెప్పి మొఖం చాటేశారని ఫిర్యాదుదారులు అంటున్నారు. దీంతో ఆ శాఖ ఆర్‌జేసీకి ఫోన్ చేసి ఫిర్యాదు చేయడంతో ఆ అధికారి ఆదేశాల మేరకు స్థానిక అధికారి, సిబ్బంది శనివారం మధ్యాహ్నం సంబంధిత భూమి వద్దకు వెళ్లి తవ్వకాలు నిలిపివేయించారు. వారు వెళ్లిన తరువాత మళ్లీ తవ్వకాలు చేపట్టారని స్థానికులు చెబుతున్నారు. అలాగే పలివెల – పల్లిపాలెం రోడ్డు నుంచి మట్లదొడ్డి వెళ్లే రోడ్డులో ఉమా కొప్పేశ్వరస్వామివారి దేవస్థానానికి చెందిన భూమిలో ఐదు రోజుల క్రితం మట్టి అక్రమ తవ్వకాలు చేపట్టగా స్థానికుల ఫిర్యాదు మేరకు దేవస్థానం సిబ్బంది వెళ్లి నిలిపివేయించారు. తిరిగి శుక్రవారం తవ్వకాలు చేపట్టారు. దానిపై ఫిర్యాదు చేయగా, అది దేవస్థానం భూమి కాదని, ఫలానా రైతుకు చెందిన ప్రైవేట్ భూమిలో మెరకలు తీస్తున్నారని సంబంధిత దేవస్థానం, రెవెన్యూ సిబ్బంది చెప్పి చేతులు దులిపేసుకున్నారు. దీంతో సంబంధిత రైతుకు స్థానికులు ఫోన్ చేసి ఆరా తీయగా తమ భూమి ఇప్పటికే పల్లమని, మట్టి తీయాల్సిన పనిలేదని చెప్పారు. దేవదాయ శాఖ భూముల్లో మట్టి అక్రమ తవ్వకాలపై సంబంధిత ఈఓ ఎస్.శివను «సాక్షి» వివరణ కోరగా ధర్మసత్రం భూమిని పూజారిపాలేనికి చెందిన పల్లికొండ అర్జునరావు కౌలుకు పాడుకున్నారని తెలిపారు. మట్టి తవ్వకాలపై తమకు సమాచారం అందిన వెంటనే వెళ్లి నిలదీయగా మెరక పల్లాలు సరిచేసుకునేందుకు తవ్వుతున్నట్టు తెలిపారని, అనుమతులు లేకుండా తవ్వడం తగదని చెప్పి నిలిపివేయించామన్నారు.